



పర్యాటకానికి నెలవు

- ఉత్తర, దక్షిణ భారతదేశాలకు కేంద్ర బిందువుగా రైల్వే జంక్షన్
- గుంతకల్లులో మారిన రూపురేఖలు


గుంతకల్లు ఏరియా వ్యూ


మేరీ మాత చర్చి


కసాపురం నెట్టికంటి అంజనేయ స్వామి ఆలయ రాజగోపురం


మస్తానయ్య దర్గా

గుంతకల్లు: గుంతకల్లు పట్టణం ప్రధాన నగరాలకు దీటుగా దూసుకుపోతోంది. విద్యా, వైద్య, వ్యాపార రంగాల్లో రోజు రోజుకూ అభివృద్ధి చెందుతోంది. రెండు, మూడు ఫ్లోర్ల స్థాయి నుంచి నేడు అపార్టుమెంట్ కల్చరర్‌కు మారుతోంది. దీనికి తోడు గుంతకల్లు రైల్వే డివిజన్ కేంద్రం కావడం.. ఇక్కడ ఉత్తర, దక్షిణ భారతదేశాలకు ఇక్కడ నుంచి ఎక్కడికైనా రాకపోకలు సాగించాడనికి రైళ్ల సౌకర్యాం ఉండటంతో వ్యాపారులు, విద్యార్థులు, ఇతర రంగాల వారికి ఉపయోగకరంగా ఉంది. అంతేకాకుండా మండ స్థాయి నుంచి రెవెన్యూ డివిజన్‌గా మార్పు చెంది గుంతకల్లు పట్టణం ప్రగతి పథం వైపు దూసుకుపోతుంది. పట్టణంలో బజాజ్, టీవీఎస్, సుజుకీ యాక్సస్, బుల్లెట్ బైక్. ఎలక్ట్రికల్ బైక్ షోరూమ్‌లతో పాటు పలు కంపెనీల కార్ల షోరూమ్‌లు అందుబాటులో ఉన్నాయి.

కులమతాలకు అతీతంగా..

గుంతకల్లు నియోజకవర్గ ప్రజలు కులమతలకు అతీతంగా సోదరభావంతో మెలుగుతుంటారు. అందుకు ఉదాహరణ గుంతకల్లులో రాయలసీమలోనే ప్రసిద్ధి చెందిన క్షేత్రాలు ఇక్కడ వెలిశాయి. గుంతకల్లు మండలంలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధిగా నిలిచింది. అదేవిధంగా మస్తానయ్య దర్గాకు సంబంధించిఉరుసు మహోత్సవాలకు వేలాదిగా తరలివస్తుంటారు. ఇక గుంతకల్లు మేరిమాత చర్చి రాయలసీమలోనే ప్రసిద్ధిగాంచింది.

అందుబాటులో విద్య, వైద్యం..

ఒకప్పుడు చిన్న చిన్న ప్రైవేట్ వైద్యశాలకే పరితమైన గుంతకల్లులో కార్పొరేట్ తరహా వైద్యం అందుబాటులోకి వచ్చింది. చిన్న ప్రమాదం జరిగినా అనంతపురం, కర్నూలు. బళ్లారి పట్టణానికి ఈ ప్రాంత ప్రజలు వెళ్లావారు. ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్యశాలలు ఏర్పాటు చేస్తుండటం, నిత్యం అందుబాటులో ఉండటంతో వైద్యసదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంతోపాటు బ్లడ్ బ్యాంకు కూడా ఏర్పాటు చేశారు. ఇక విద్యారంగంలో గుంతకల్లు అగ్రగామి ఉంది. ఆయూష్, ఆయుర్వేద కళాశాల కేంద్రం గుంతకల్లు ఉండటం విశేషం. గుంతకల్లులో ఎంబీఏ, ఎంసీఏ కళాశాలతోపాటు పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలు అందుబాటులో ఉన్నాయి.

ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు కేంద్ర బిందువు

ఉత్తర, దక్షిణ భారతదేశాలకు కేంద్ర బిందువుగా గుంతకల్లు జంక్షన్ నిలుస్తోంది. రైల్వే ఉన్నతాధికారులు గుంతకల్లును రైల్వే డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. దీంతో జిల్లా ప్రజలు ముంబై, చైన్నై, బెంగుళూరు. హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్నం. గోవాతోపాటు ఇతరత్ర ప్రాంతాలకు వెళ్లాడానికి గుంతకల్లు జంక్షన్ నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. గుంతకల్లు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన స్టేషన్ భవనం ఎయిర్‌పోర్టు తరహాలో ఉండటం విశేషం.


















దొంగల ముఠా అరెస్ట్

యాడికి: చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ ఈరన్న వెలల్లడించారు. యాడికిలోని వెంగమనాయుడి కాలనీకి చెందిన నరసింహులు కుమారుడు ఓబులేసు అలియాస్ అభిలాష్, రాఘవేంద్ర కాలనీకి చెందిన దూదేకుల మస్తానయ్య కుమారుడు ఖలీల్, గోపాల్ కుమారుడు చింతా గోవర్దన్ స్నేహితులు. వ్యసనాలకు బానిసలైన వీరు తమ జల్సాకు అవసరమై న డబ్బు కోసం చోరీలకు తెరలేపారు. ఈ క్రమంలో యాడికి పంచాయతీ పరిధిలో వాటర్ మెన్‌గా పనిచేస్తున్న అభిలాష్ రాత్రి సమయాల్లో కాలనీలకు నీళ్ల వదులుతూ తాళం వేసి ఉన్న ఇళ్ల బయట అమర్చిన మోటార్లను ఖలీల్, గోవర్దన్‌తో కలసి అపహరించుకెళ్లేవాడు. ఈ క్రమంలోనే మూడు రోజుల క్రితం కమలపాడు రోడ్డులో ఉన్న ధాన్యం గోదాములో 10 బస్తాల జొన్నలు, సద్దలు, కొర్రలు, చందన రహదారిలో కొత్తగా నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద రెండు మోటార్లను అపహరించారు. ఆయా ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేసి, 5 ప్యాకెట్ల జొన్నలు, 3 ప్యాకెట్ల కొర్రలు, 2 ప్యాకెట్ల సజ్జలు, ఓ ద్విచక్ర వాహనానిస్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

నలుగురు నిందితుల అరెస్టు

తాడిపత్రి రూరల్: వ్యక్తిపై దాడి చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన వెల్ల డించారు. తాడిపత్రిలోని సీపీఐ కాలనీలో ఉంటున్న ప్రదీప్, హాజీవలి, మరో ఇద్దరు మైనర్లు వ్యసనాలకు బానిసలయ్యారు. తమ జల్సాలు తీర్చుకునేందుకు ఒంటరిగా ఉన్న వారిపై దాడి చేసి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు, డబ్బును లాక్కొని వెళ్లేవారు. ఈ నేపథ్యంలో అనంతపురం బైపాస్ రోడ్డులో పనులు చేస్తున్న సునీల్‌కుమార్‌పాండేపై దాడి చేసి రాళ్లతో గాయపరిచి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు నగదును దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను శనివారం అరెస్ట్ చేసి, సెల్‌ఫోన్‌తో పాటు రూ.1,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రదీప్, హాజీబాషాను న్యాయస్థానంలో హాజరుపరిచారు. మైనర్లను బాలల పరివర్తన కేంద్రానికి తరలించారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి


తాడిపత్రిలో వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ, వడ్డెర సంఘం సభ్యులు

తాడిపత్రి అర్బన్/గుత్తి/గుంతకల్లు టౌన్: స్వాతంత్య్ర ఉద్యమాలు చేసి జాతి ఉనికిని చాటిన గొప్ప వ్యక్తి వడ్డే ఓబన్న అని అర్బన్ సీఐ సాయిప్రసాద్ అన్నారు. తాడిపత్రిలోని మహాత్మాగాంధీ సర్కిల్‌లో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డెర యువజన సంఘం సభ్యులు పీట్ల శ్రీరాములు, కేతన గంగాధర్, మంజుల వెంకట యోగేష్, గోవర్దన్, సురేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- గుత్తిలో శనివారం వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మన్రో సత్రం సమీపంలో ఉన్న వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సూర్యవంశ వడియా రాజుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీదేవి, మండల అధ్యక్షులు చిరంజీవి, ధర్మాపురం సర్పంచు చంద్ర తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

- గుంతకల్లులోని బీజేపీ కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రకపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, నాయకులు కొలిమి రామాంజి, విజయలక్ష్మి, సూర్యనారాయణ, శ్రీనివాసులు, కళావతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన దేవాలయాలకు కొలువు

- మూడు జిల్లాల సరిహద్దు కేంద్రంగా తాడిపత్రి
- విస్తరిస్తోన్న రియల్ ఎస్టేట్ రంగం
- ధమ్ బిరియానీలకు పెట్టింది పేరు




ప్రాచీన చింతల వెంకట రమణస్వామి ఆలయం, బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం

తాడిపత్రి: ప్రాచీన ఆలయాలకు కొలువుగా ఉన్న తాడిపత్రి వ్యాపార, వాణిజ్య, పారిశ్రామికంగా, విద్య, వైద్యం, రియల్ ఎస్టేట్ రంగాల్లో పరిధిని విస్తరించుకుంటూపోతోంది. అతి పురాతన చింతల వెంకటరమణ స్వామి, బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయాలు అత్యంత విశిష్టతను సంతరించుకున్నాయి. అలూరు కోన రంగనాథ స్వామి ఆలయం, పెద్దపప్పూరులోని అశ్వర్థ నారాయణుడి ఆలయం , ఆలూరు కోన వద్ద నీటి జలపాతాలు, కొండలు, కోనలు, దేవరకోన, యాడికి మండలంలోని కోన ఉప్పలపాడు జలపాతాలు పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి.

వ్యాపార, వాణిజ్య కేంద్రాలకు నెలవు....

గ్రానైట్, పాలిష్ నల్లబండల పరిశ్రమలకు హబ్‌గా రాష్ట్రంలో ఎక్కడా లేని పేరును తాడిపత్రి సంపాదించుకుంది. దాదాపు 600 నల్లబండల పాలిష్ ఫ్యాక్టరీలు, దాదాపు 1000 వరకు గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ మూలంగా వేలాది మందికి ఉపాధి లభిస్తోంది. అలాగే ఈ ప్రాంతంలో అల్ట్రాటెక్, పెన్నా ప్రస్తుతం అంబుజా, సాగర్ సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయి. అర్జాస్ స్టీల్ ప్లాంట్ ఉంది.

విస్తరిస్తోన్న రియల్ ఎస్టేట్ రంగం..

తాడిపత్రి వైఎస్సార్, నంద్యాల, అనంతపురం జిల్లాల సరిహద్దుకు కేంద్ర బిందువుగా ఉండడంతో పాటు జాతీయ రహదారి 544 డి పై ఉంది. చెన్నయ్ నుంచి ముంబయి ప్రధాన రైలు మార్గంలో తాడిపత్రి రైల్వే స్టేషన్ ఉంది. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు రైలు, బస్సు రవాణా వ్యవస్థలు అనుకూలంగా ఉండడంతో రియల్ ఎస్టేట్ రంగం విస్తరిస్తోంది. ఇండివీజువల్, అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ నిర్మాణాలతో రియల్ ఎస్టేట్ రంగం సిటీలకు పోటీగా మారుతోంది. కేజీటు ఇంజినీర్ కళాశాలలు ఇక్కడనే వెలిశాయి. శస్త్ర చికిత్సలు చేసే స్థాయి ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు వంద పడకల ప్రభుత్వాస్పత్రి ఏర్పాటు వల్ల రోగులు సకాలంలో స్థానికంగానే వారి జబ్బులకు చికిత్స తీసుకునేందుకు అనువుగా ఉంటోంది. అలాగే బంగారం వ్యాపారంలో ముంబయి తర్వాత ప్రొద్దుటూరు పేరుగడిస్తే ఆ తర్వాత బంగారు క్రయ విక్రయాలకు తాడిపత్రి ప్రసిద్ధిగాంచింది.

ధమ్ బిరియానీలకు పెట్టింది పేరు..

ధమ్ బిరియానీ తయారీలో తాడిపత్రి పెట్టింది పేరు. జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా తాడిపత్రి ధమ్ బిరియానీ పేరిట హోటళ్లు, రెస్టారెంట్లు వెలుస్తున్నాయి. తాడిపత్రి ప్రాంతంలో వందల సంఖ్యల్లో వివిధ రకాల పేర్లతో పిలవబడే బిరియానీలు తక్కువ ఖరీదులో లభిస్తాయి.

పెద్ద వస్త్ర దుకాణాలు సైతం..

తాడిపత్రి వస్త్ర దుకాణాలకు సైతం పేరు గాంచింది. కాసం వస్త్ర దుకాణం, ఆకృతి వస్త్ర దుకాణం వంటి అతి పెద్ద వస్త్ర దుకాణాలతో పాటు విశాల్ షాపింగ్ మాల్, స్మార్ట్ షాపింగ్ మాల్, వి మార్ట్ షాపింగ్ మాల్‌లు తాడిపత్రి ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

పార్టీ మరింత బలోపేతానికి కృషి



ఎన్వీ నారాయణ



పెమ్మక చెన్నకేశవరెడ్డి

శింగనమల: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎన్వీ నారాయణ అన్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి ఆయన శనివారం కృతజ్ఞతలు తెలిపారు. గతంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడి పనిచేశానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పామిడి: వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీగా నియమించినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌కు పామిడివాసి పెమ్మక చేన్నకేశవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తాను గతంలో గుత్తి మార్కెట్‌యార్డు చైర్మన్‌గా, మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడిగా పనిచేశానన్నారు.

నివాళి



వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్ జిల్లా పులివెందులలో వైఎస్ అభిషేక్‌రెడ్డి పార్థివదేహానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

ఎస్ఆర్ఐటీలో సంక్రాంతి సంబరాలు



సంబరాల్లో విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. కళాశాల ప్రాంగణమంతా రంగురంగుల ముగ్గులతో సంప్రదాయలకు అద్దం పట్టేలా భోగి మంటలు వేశారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

యాడికి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని రాయలచెరువు గ్రామంలో శనివారం రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆర్గనైజర్లు శంకర్‌నాయుడు, రాము, రషీద్‌తో కలసి పారిశ్రామిక వేత్త రామకృష్ణ పరమహంస ప్రారంభించారు. కార్యక్రమంలో బాబా, బ్రహ్మానందరెడ్డి సుధాకర్, షబ్బీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడితే కఠిన చర్యలు

శింగనమల : శింగనమల సర్కిల్ పోలీస్టేషన్ పరిధిలోని శింగనమల, గార్లదిన్నె, నార్పల మండలాల్లో కోడి పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అసాంఘిక చర్యలకు పాల్పబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

బుక్కరాయసముద్రం: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటా మని సీఐ కరుణాకర్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోడి పందేలు, జూదం, పేకాట ఆడినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా కోడి పందేలు ఆడినట్లు తెలిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

14న కల్లూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరులో ఈ నెల 14న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్తులు శనివారం వెల్లడించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం యువకులకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే జట్లు ఈ నెల 13వ తేదీలోపు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వరుసగా తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేత జట్లకు వరుసగా రూ.8,000, రూ.5,000, రూ.3,000, రూ.1000 నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. పూర్తి వివరాలకు 79816 46683, 63026 55150లో సంప్రదించవచ్చు.